క్లుప్తంగా

ఘనంగా శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ



శ్రీనివాసుని ఉత్సవమూర్తికి విశేష పూజలు

పులివెందుల టౌన్: రజత శ్రీభోగ శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ కార్యక్రమాన్ని స్థానిక శ్రీవేంకటరమణుడి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు బుధవారం ఆలయంలో ఆలయ అర్చకులు ఉదయం భగవత్ ప్రార్థన, స్వస్తివాచనం, ఆచార్య రుత్వికరణతోపాటు మహామంగళ హారతులు పట్టారు. సాయంత్రం స్వస్తివాచకం, అంకురార్పణ నిర్వహించి అగ్నిప్రతిష్ట, ప్రధాన నిత్య హోమాలు, సర్వదేవతా హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం ఎంపిక

జమ్మలమడుగు : పీడీఎస్‌యూ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నరేష్, సహాయ కార్యదర్శులుగా చంద్ర, కళ్యాణ్, దామోదర్ ఉపాధ్యక్షులుగా చరన్, సుమంత్, కోశాధికారిగా ప్రభాస్‌ను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి

పెండ్లిమర్రి : రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్బారావు అన్నారు. పెండ్లిమర్రి రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంట నమోదుతో పాటు ఈకేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన డబ్బులు పడని రైతులు మార్చి 31వ తేదీ నాటికి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బ్లెస్సీ, ఏఈఓ గంగాప్రసాద్, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాక

లింగాల : మండల పరిధిలోని కోమన్నూతల, మురారిచింతల గ్రామాల్లో గురువారం జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు మురారిచింతల సచివాలయంలో, మధ్యాహ్నం 2 గంటలకు కోమన్నూతల సచివాలయంలో రైతులతో చర్చలు నిర్వహిస్తారని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. ఆయా పంచాయతీ గ్రామాల మీదుగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గిడ్డంగివారిపల్లె చెరువుకు వెళ్లే భారీ పైపులైన్ మార్గంలో భూసేకరణ విషయమై రైతులతో చర్చలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కొండపేటలో ప్రత్యేక ప్రార్థనలు

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో వెలసిన పునీత జోజప్ప ఆలయ ఆవరణలో ఈనెల 17, 18 తేదీల్లో ప్రత్యేక ప్రార్థన కూటములు ఏర్పాటు చేస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రార్థన కూటములకు వివిధ చర్చిల నుంచి 70మంది గురువులు, బ్రదర్లు విచ్చేస్తారన్నారు. ఈ ప్రార్థనల్లో విశ్వాసులు పాల్గొని ఏసుక్రీస్తు కృపకు పాత్రులు కావాలన్నారు.

విద్యార్థికి అభినందన

కడప ఎడ్యుకేషన్ : కడప కాగితాలపెంట జెడ్పీ ఉర్దూ హైస్కూల్ 8వ తరగతికి చెందిన షేక్ సుమయ్య అనే విద్యార్థి టేక్వాండో చాంపియన్ షిప్-2023 పోటీలో గోల్డ్ మెడల్‌ను సాధించినట్లు హెడ్‌మాస్టర్ సునితా తెలిపారు. ఈనెల 11,12 తేదీలలో తిరుపతిలో జరిగిన ఫస్ట్ ఓపెన్ సౌత్ జోన్ టేక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాడు.

దళారుల బెడద నుంచి కాపాడటానికే

కొనుగోలు కేంద్రాలు

- శనగలకు బహిరంగ మార్కెట్ కంటే రూ.935 అధికం
- రైతులకు ఆపన్న హస్తంగా కొనగోలు కేంద్రాలు

కొనగోలు కేంద్రాలకు శనగలు తీసుకెళ్లే రైతులు పాటించాల్సిన ప్రమాణాలు

క్రమ సంఖ్య	వివరాలు	గరిష్ట పరిమితి శాతం
1	ఇతర వ్యర్థ పదార్థాలు	1
2	ఇతర పప్పుదినుసు గింజలు	3
3	దెబ్బతిన్న పప్పుదినుస గింజలు	3
4	కొద్దిగా దెబ్బతిన్న, రంగులేని పప్పుదినుసు గింజలు	4
5	పక్వానికిరాని, ముడత/ కుచించుకుపోయిన పుప్పుదినుసు గింజలు	6
6	ఇతర శనగ పంట రకాల గింజలు	2
7	పురుగు పట్టిన పప్పుదినుసు గింజలు	4
8	తేమ శాతం	14



కమలాపురంలోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారులు

వివరాలు

శనగల సాగు విస్తీర్ణం	: 71,824 ఎకరాలు
కొనుగోలు లక్ష్యం	: 17 వేలమెట్రిక్ టన్నులు
మద్దతు ధర	: రూ.5,335
బహిరంగ మార్కెట్ ధర	: రూ.4,400

కమలాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని చెప్పడంలో సందేహం లేదు. విత్తు నుంచి విక్రయం వరకు ప్రతి దశలో ప్రభుత్వం రైతును ఆదుకోవడంలోనే రైతు పక్షపాతి ప్రభుత్వం అని తెలుస్తోంది. పంటలు సాగు చేసుకోవడానికి అతి ముఖ్యమైన, అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతుల ముంగిటకే సమయానికే చేరవేయడంతో పాటు సాగు ఖర్చులకు ప్రభుత్వం రైతు భరోసా ద్వారా నగదు రైతుల ఖాతాల్లోనే జమ చేస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్ చేయడంతో పాటు ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. పంటలు చేతికొచ్చాక దళారుల బారినుంచి రైతులను రక్షించడానికి కొనుగోలు కేంద్రాలు సైతం ప్రభుత్వమే ఏర్పాటు చేసి రైతు ఉత్పత్తులను బహిరంగ మార్కెట్ కంటే అధిక ధర వెచ్చించి కొనగోలు చేస్తోంది. ఏ దశలోనూ రైతు ఇబ్బంది పడకుండా, నష్ట పోకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుండటంతో రైతు పక్షపాతి ప్రభుత్వం అనక తప్పదు.

17వేల మెట్రిక్ టన్నుల శనగలు సేకరణ లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 17 వేల మెట్రిక్ టన్నుల శనగలు సేకరించడమే లక్ష్యంగా విధించుకున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన శనగ పంటల్లో 71,824 ఏకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. సాగు చేసిన ప్రతి రైతు నుంచి శనగలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కొనుగోలు చేసే పద్ధతి ఇదే

శనగలు సాగు చేసి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేసుకున్న రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లు నమోదు చేసుకోవాలి. పేర్లు నమోదు చేసుకున్న రైతుల మొబైల్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది. ఆ సమాచారంలో ఆ రైతు ఏ రోజు ఎంత పరిమాణంలో శనగలు కేంద్రాలకు తీసుకెళ్లాలో షెడ్యూల్ వస్తుంది. ఆ మేరకు మాత్రమే శనగలు కేంద్రాలకు తీసుకెళ్లాలి. ఒక్కో రైతు నుంచి రోజుకు 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు. రైతులు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది.

బహిరంగ మార్కెట్‌లో రూ.4,400... మద్దతు ధర రూ.5,335 :

శనగలు బహిరంగ మార్కెట్‌లో రూ.4,400 పలుకుతోంది. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.5,335. అంటే క్వింటాకు రూ.935 అధికం. ఒక రైతు కనీసం 10 క్వింటాళ్లు పండిస్తే బహిరంగ మార్కెట్ కంటే రూ.9,350 అధికంగా వస్తుంది.

నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

కొనుగోలు కేంద్రాల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించి శనగలు కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. శనగలు కొనుగోలు చేసే సమయంలో క్వాలిటీ చెకింగ్ మూడు దశల్లో జరుగుతుంది. కేంద్రాల్లో సెంటర్ ఇన్‌చార్జ్ వద్ద, మార్క్‌ఫెడ్ థర్డ్ పార్టీ చెకింగ్ తర్వాతనే శనగలు కొనుగోలు చేస్తారు. చెకింగ్ తర్వాత ఒక్కో రైతు ఒక క్యూఆర్ కోడ్ కేటాయించి బస్తాలకు కుడుతారు. వాటిని కేంద్ర, రాష్ట్ర గిడ్డంగుల్లో నిల్వ చేస్తారు. అయితే అక్కడున్న నాణ్యతా ప్రమాణాల పరిశీలకుడు వాటిని పరిశీలిస్తాడు. ఒక రైతుకు చెందిన ఒక లాట్‌లో ఒక బస్తా శనగలు సరిగా లేకున్నా అన్ని బస్తాలు వెనక్కి పంపిస్తారు. దీనికి ముందు చెకింగ్ చేసిన కేంద్రాల ఇన్‌చార్జ్ పూర్తిగా బాధ్యత వహించి వెనక్కు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

22 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

శనగలు, మినుములు, పెసలు కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 22 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి తెలిపారు. ఇందులో 21 డీసీఎంఎస్ ద్వారా ఒక కేంద్రం ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) ద్వారా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

కొనుగోలు కేంద్రాల వివరాలు

డీసీఎంఎస్-కమలాపురం, డీసీఎంఎస్-వీఎన్‌పల్లె, డీసీఎంఎస్-పెండ్లిమర్రి, డీసీఎంఎస్-వల్లూరు, డీసీఎంఎస్-పులివెందుల, డీసీఎంఎస్-లింగాల, డీసీఎంఎస్-వేముల, డీసీఎంఎస్-వేంపల్లె, డీసీఎంఎస్-సింహాద్రిపురం, డీసీఎంఎస్- తొండూరు, డీసీఎంఎస్-జమ్మలమడుగు, ఎఫ్‌పీఓ-పెద్దముడియం, డీసీఎంఎస్-మైలవరం, డీసీఎంఎస్-కొండాపురం, డీసీఎంఎస్- ముద్దనూరు, డీసీఎంఎస్-ఎర్రగుంట్ల, డీసీఎంఎస్-ప్రొద్దుటూరు, డీసీఎంఎస్-రాజుపాళెం, డీసీఎంఎస్-దువ్వూరు, డీసీఎంఎస్-బద్వేల్, డీసీఎంఎస్-పోరుమామిళ్ల.

నాణ్యాతా ప్రమాణాలే ప్రామాణికం



శనగల కొనుగోలు కేవలం నాణ్యతా ప్రమాణాలే ప్రామాణికంగా కొనుగోలు చేస్తాం. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. కొనగోలు కేంద్రాల్లో రెండు చోట్ల చెకింగ్ చేస్తారు. అనంతరం నిల్వ ఉంచే గిడ్డంగుల్లో అక్కడి పరిశీలకుడు పరిశీలిస్తాడు. అక్కడ ఒక రైతుకు చెందిన లాట్‌లోని ఒక బస్తా నాణ్యత సరిగా లేకపోతే అన్ని బస్తాలు వెనక్కి పంపిస్తారు. ఆ బాధ్యత పూర్తిగా కేంద్రాల వద్ద చెకింగ్ చేసే ఇన్‌చార్జ్‌లదే. రైతులు తమ మొబైల్‌లకు సంక్షిప్త సమాచారం వచ్చిన తర్వాతనే శనగలు కేంద్రాలకు తీసుకురండి.

– తాటిగుట్ల నరసింహారెడ్డి, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం, వైఎస్సార్ జిల్లా

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



బహిరంగ మార్కెట్ కంటే అధక ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్న ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.935 ఎక్కువగా ఉన్నది. జిల్లా రైతులందరూ తప్పని సరిగా తమ ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రయోజనం ఉంటుంది. – సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారుడు.

అర్హులైన రైతులందరికీ డ్రిప్ పరికరాలు అందిస్తాం

ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి, తదితరులు

వేముల : పంటల సాగులో అవసరమైన డ్రిప్ పరికరాలను అర్హులైన రైతులందరికీ అందిస్తామని ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దజూటూరు గ్రామంలో బుధవారం రైతులకు పంపిణీ చేసిన డ్రిప్ పరికరాలను హెచ్ఓ రాఘవేంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అర్హులుగా ఉండి డ్రిప్ అందని రైతులు ఆయా ఆర్‌బీకేలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. డ్రిప్ పరికరాల కోసం డీడీలు తీసిన రైతులకు 10 రోజుల్లోపు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఐఓ నగేష్, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నూరు : కొండపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దివంగత పెడబల్లి సుబ్బారెడ్డి, పెడబల్లె శివారెడ్డిల సంస్మరణార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వారిచే కొండపేట బంగ్లాలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అధునాతన టెక్నాలజీతో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేస్తారని పుష్పగిరి కంటి ఆస్పత్రి క్యాంపు కో ఆర్డినేటర్ అమర్నాథరెడ్డి తెలిపారు. ఆపరేషన్లు చేయించుకునే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీకార్డు తప్పక తీసుకురావాలని, వారికి పుష్పగిరి కంటి ఆస్పత్రి వారు ఉచిత వాహన, భోజన సౌకర్యంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు.

డెంగీ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి

లింగాల : డెంగీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. బుధవారం లింగాల పీహెచ్‌సీ పరిధిలోని పార్నపల్లె ఎస్సీ కాలనీలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, వైద్యాధికారి డాక్టర్ సుభాషిణిల ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నీటి నిల్వలు ఉన్న నీటి తొట్లలో అబేట్‌ను పిచికారి చేసి వైద్య శిబిరం నిర్వహించారు. దోమల నివారణ కొరకు పైరిత్రం పిచికారి చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ వ్యాధులు వస్తాయని.. కాబట్టి దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు బుడ్డ శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పులివెందుల రూరల్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నేటి నుంచి బుడ్డశనగల కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతుందని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ-క్రాప్ చేసుకున్న రైతులు మాత్రమే ఆర్‌బీకేలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న రైతులకు వారి సెల్‌ఫోన్లకు మెసేజ్ వస్తుందన్నారు. మెసేజ్ వచ్చిన రైతులు మాత్రమే మార్కెట్ యార్డుకు వచ్చి శనగలు విక్రయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా క్వింటా ధర మార్కెట్‌లో రూ.4,500లు ఉంటే.. మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, నాఫెడ్ కంపెనీల ద్వారా రూ.5,335లతో శనగలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన పంటలో మార్కెట్ యార్డు తీసుకునేటప్పుడు మట్టి పెల్లలు, పుల్లలు, దుమ్ము, ధూళి లేకుండా బుడ్డశనగలను వెంటనే కొనుగోలు చేసి విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. రైతుల పక్షాన నిలిచిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో జిల్లాకు పతకాల పంట

కడప స్పోర్ట్స్ : ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్స్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో మొత్తం 35 పతకాలు సాధించి సత్తాచాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన 22 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. వీరిలో 19 మంది క్రీడాకారులు వైఎస్ఆర్ క్రీడాపాఠశాల నుంచి ప్రాతినిధ్యం వహించడం విశేషం. ఈ పోటీల్లో 21 స్వర్ణపతకాలు, 6 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఉత్తమ శిక్షణ అందించిన జిమ్నాస్టిక్స్ శిక్షకుడు తమీమ్ అన్సారీని అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..

సి. శేషాద్రి, వై.గంగునాయుడు, వై.శశాంక్, వి.బస్వరాజు, పి. రాఘవ, వై.వి.ప్రణీత్, కె. వరుణ్‌తేజ, కె. తేజ, ఎస్.జె. నిఖిల్, ఎస్. సరస్వతి, ఆర్. నాగ వేణి, ఎన్.శివనందిని, పి.హిమవర్షిణి, వై.గంగాభవాని, ఎస్.ధరణి, వై.స్వాతి, కె.ఈశ్వరి, కె.రజిత, సి.హెచ్. జోహిత శ్రావ్య, వై.కిరణ్మయి, సుధ, సుహైల్.

ఘనంగా గ్రామోత్సవం

దువ్వూరు : మండల పరిధిలోని మూడిండ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయ, ధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా బుధవారం మూల విరాట్‌లైన సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలకు క్షీరాభిషేకం, అవాహిత పూజ, విగ్రహ జలోద్వాసన వాస్తు నవగ్రహ విగ్రహమూర్తుల జపాలు, యంత్రాభిషేకం, చండీ దీక్షా హోమం, మహాగణపతి మన్యసూక్తి హోమాలు నిర్వహించారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లోని వీధుల గుండా మంగళవాయిద్యాలతో ఊరేగించారు. గ్రామస్తులు స్వాములకు వారికి కాయకర్పూరం సమర్పించారు.

నేడు బండలాగుడు పోటీలు :

న్యూ కేటగిరి ఎద్దులకు గురువారం ఉదయం 7.30 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,016, రెండో బహుమతి రూ.40,016, మూడో బహుమతి రూ.30,016, నాల్గో బహుమతి రూ. 20,016, ఐదో బహుమతి రూ.10,016, ఆరో బహుమతి రూ.5,016 అందిస్తామని వివరించారు.

జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ



సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

పులివెందుల రూరల్ : జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 5 మంది విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈ విద్యార్థులు తయారు చేసిన నమూనాలను డీఈఓ దేవరాజు పరిశీలించి మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ చేతులమీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రంతోపాటు మెమెంటోను అందించారు. రాబోయే రోజులలో మరిన్ని మంచి ప్రాజెక్టులు చేసి అభివృద్ధిపరచాలని.. భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

గంగమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

21న సీకే దిన్నె గంగజాతర మహోత్సవం



గంగజాతర మహోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె/వైవీయూ : చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గ్రామంలో వెలసిన గంగమ్మదేవత జాతర మహోత్సవం ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలో కమలాపురం శాసనసభ్యుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన స్వగృహంలో జాతర మహోత్సవంకు సంబంధించిన పోస్టర్లు, ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల పాలిటి కొంగు బంగారమై, కోరిన వరాలనొసగే గంగమ్మ జాతర వార్షిక జాతరను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ పి.బి. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 21వ తేదీ మంగళవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి కళ్యాణము, నిండుతిరుణాల, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న మైల తిరుణాల నిర్వహిస్తామని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్క దేవతల పూజలు



ప్రత్యేక అలంకరణలో అక్క దేవతలు



కోలాహలంగా సాగిన చెక్కభజన పోటీలు

లింగాల : పులివెందుల-పార్నపల్లె ప్రధాన రహదారిలోని కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం, కడప జిల్లాలకు చెందిన చెక్కభజన బృందాలకు చెక్కభజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానంలో నిలిచిన చెక్కభజన బృందాలకు రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అక్కదేవతలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

యువశక్తితో అద్భుత ఫలితాలు

వ్యక్తిత్వ వికాస ప్రేరణసభలో స్వామి సన్నివాసానంద



మాట్లాడుతున్న సన్నివాసానంద

వైవీయూ : యువత క్రమశిక్షణతో శక్తియుక్తులను వినియోగించగలిగితే ప్రపంచం మెచ్చే గొప్ప వ్యక్తులుగా తయారవుతారని రామకృష్ణ మఠం స్వామీజీ సన్నివాసానంద, చిన్మయమిషన్ స్వామీజీ తురియానంద మహారాజ్ ఉద్బోధించారు. బుధవారం వైవీయూలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద రచనలు - వ్యక్తిత్వ వికాసం' అన్న అంశంపై ప్రత్యేక ఉపన్యాస, ప్రేరణసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి సన్నివాసానంద మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను, ఆదర్శాలను ప్రపంచానికి చాటిన వివేకానందున్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువతశక్తిని సరైన మార్గంలో వినియోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. చిన్మయ మిషన్ స్వామీజీ తురియానంద మహారాజ్ మాట్లాడుతూ ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరుకోవడానికి తీసుకునే నిర్ణయాలు కఠినంగా అమలు చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా.కె.రామ సుబ్బారెడ్డి, వైవీయూ అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు మాట్లాడారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అలుమ్నీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, శివశంకర్, సురేష్‌యాదవ్, శశికుమార్, మానస, రాఘవరెడ్డి, మోజెస్, హరి, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

సమాజ ప్రయోజనమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం కావాలి

వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : జాతీయ సేవాపథకంలోని ప్రతి ఒక్కరూ సమైక్యంగా పనిచేయడం ద్వారా సమాజ ప్రయోజనాలను నెరవేర్చవచ్చని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కు చెన్నైకి చెందిన రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక సేవలో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి నుంచి బయటపడేందుకు పర్యావరణ పరిరక్షణ, జలసంరక్షణ వంటి చర్యలు చేపట్టాలన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకటరామిరెడ్డి ,ఎన్ఎస్ఎస్ మాజీ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎ. మధుసూధన్‌రెడ్డి, ఢిల్లీకి చెందిన ఇషానిసేన్ తదితరులు మాట్లాడారు.

బొగ్గుల బట్టీలను గ్రామానికి దూరంగా తరలించాలి



బొగ్గుల బట్టీలను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

వేంపల్లె : మండల పరిధిలోని ముతుకూరు గ్రామంలో ఉన్న బొగ్గుల బట్టీలను గ్రామానికి దూరంగా తరలించాలని బొగ్గుల బట్టీ నిర్వాహకులకు తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆ గ్రామంలో నెలకొన్న బొగ్గుల బట్టీ ప్రాంతాలను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కాశిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. కొన్ని రోజులుగా ఆ గ్రామ ప్రజలు బొగ్గుల బట్టీల ద్వారా వెలువడే కాలుష్యానికి నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు పరిశీలించి గ్రామానికి బయట బట్టీలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసమూర్తి, అటవీ, రెవెన్యూ శాఖల సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న తహసీల్దార్ :

అనాథ బాలుడిని వేంపల్లె తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి చేరదీసి స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠ్య పుస్తకాలు, కొత్త బట్టలు అందజేశారు. వేంపల్లె పట్టణానికి చెందిన తల్లిదండ్రులు బాలుడిని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ బాలుడిని స్థానికుల సమాచారం మేరకు తహసీల్దార్ చేరదీసి తనవంతు సహాయ సహకారాలు అందించారు.